క్లుప్తంగా

క్షీరా రామలింగేశ్వరుని పూజా సామగ్రి సమర్పణ



ఆలయ ఈఓ, ఛైర్మన్‌లకు వెండి బిందె, పాత్రలను అందజేస్తున్న దాతలు

పాలకొల్లు సెంట్రల్: స్థానిక శ్రీ క్షీరారామలింగేశ్వరస్వామికి భక్తులు వెండి బిందె, స్వామివారికి నిత్యం జలధార పడే వెండి పాత్రలను సమర్పించారు. పట్టణానికి చెందిన బోళ్ల తిరుపన్న కుమారుడు గాంధీ, కుమార్తెలు కలిసి సుమారు లక్ష రూపాయలు విలువచేసే ఒక కేజీ 400 గ్రాముల వెండి బిందె, పాత్రలను ఆలయ ఛైర్మన్ కోరాడ శ్రీనివాసరావు, ఈఓ యాళ్ల సూర్యనారాయణలకు అందజేశారు. ఈ సందర్భంగా ఈఓ, ఛైర్మన్‌లు దాతలను స్వామివారి శేషవస్త్రంతో ఘనంగా సత్కరించారు.

నేటి నుంచి క్షేత్ర పాలకుని కల్యాణోత్సవాలు

పెనుగొండ: పెనుగొండ క్షేత్ర పాలకుడు లక్ష్మీ జనార్ధన స్వామి కల్యాణ మహోత్సవాలు బుధవారం నుంచి మార్చి ఏడవ తేదీ వరకూ వేడుకగా నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ పి.సాయి ప్రసాద్, ట్రస్ట్ బోర్డు ఛైర్మన్ మేడపాటి చిరంజీవి రెడ్డిలు తెలిపారు. మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ బుధవారం 1న జనార్ధన స్వామికి సహస్ర నామార్చనలు, శ్రీదేవి, భూదేవిలకు కుంకుమార్చనలు, అంకురార్పణ, ధ్వజారోహణ, హోమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 2న స్వామి కల్యాణ మహోత్సవం, 3న స్వామికి సహస్రనామార్చనలు, 4న హోమాలు, కోలాట భజన, 5న హోమాలు, 6న కుంకుమ పూజలు, తీర్థ ప్రసాద వినియోగం నిర్వహించనున్నట్లు తెలిపారు. 7న గ్రామోత్సవం, పుష్ప యాగోత్సవం నిర్వహిస్తామన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు..

సిద్ధాంతంలో

సిద్ధాంతంలో విజయ గోపాలస్వామి, మాధవ స్వామివార్ల ఆలయాల్లో కల్యాణమహోత్సవాలు బుధవారం నుంచి నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ ముత్యాల సత్యనారాయణ తెలిపారు. బుధవారం రుక్మిణి, సత్యభామ విజయ గోపాలస్వామిల, శ్రీదేవి, భూదేవి మాధవ స్వామి వార్ల కల్యాణం నిర్వహిస్తామని పేర్కొన్నారు. 7వ తేదీ వరకూ ఉత్సవాలు జరుగుతాయని తెలిపారు. సమావేశంలో ట్రస్ట్ బోర్డు ఛైర్మన్ బలువు కేదారేశ్వరుడు పాల్గొన్నారు.

రైతులు డ్రోన్ సర్వేకి సహకరించాలి



చింతపర్రులో డ్రోన్ సర్వేను పరిశీలిస్తున్న అధికారులు, నాయకులు

పాలకొల్లు అర్బన్: మండలంలోని గత నాలుగు రోజుల నుంచి నిర్వహిస్తున్న జగనన్న సమగ్ర భూ సర్వేలో భాగంగా డ్రోన్ సహాయంతో నిర్వహిస్తున్న భూ సర్వే ముగిసిందని తహసీల్దార్ కట్టా పూర్ణిమ నాగదేవి చెప్పారు. చింతపర్రులో మంగళవారం డ్రోన్ ప్లేని మండల సర్పంచ్‌ల ఛాంబర్ అధ్యక్షుడు గుమ్మాపు పెద్దిరాజు ప్రారంభించిన సందర్భంగా తహసీల్దార్ నాగదేవి మాట్లాడారు. భూమి దస్తావేజు, పాస్‌బుక్, ఆధార్ కార్డు, బ్యాంక్ ఖాతా పాస్ పుస్తకం, ఆధార్ కార్డుతో లింకైన ఫోన్ నెంబరు, రెండు కలర్ పాస్‌పోర్టు సైజు ఫోటోలు రెవెన్యూ అధికారులకు తక్షణం అందించాలని కోరారు. 60 రోజుల్లో జగనన్న సమగ్ర భూ సర్వే రికార్డులు పరిపూర్ణమవుతాయన్నారు. రైతుల మధ్య చిన్న చిన్న వివాదాలు తలెత్తితే పరిష్కరించడానికి ప్రతి మండలంలోని మెజిస్టీరియల్ అధికారాలు ఉన్న డిప్యూటీ తహసీల్దార్‌ను ప్రభుత్వం నియమించిందని తహసీల్దార్ నాగదేవి తెలిపారు. సర్వేలో ఉప సర్పంచ్ పెన్మెత్స వెంకట రామకృష్ణంరాజు, రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ సీహెచ్ రవిరాజు, సర్వేయర్ భద్రరాజు, వీఆర్వో మండెల నరసింహరావు పాల్గొన్నారు.

మంచినీటి చెరువుకు మరమ్మతులు



కాపవరంలో అమృత సరోవర్ పథకంలో మంచినీటి చెరువు తవ్వుతున్న దృశ్యం

పాలకొల్లు అర్బన్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అమృత సరోవర్ పథకంలో పాలకొల్లు మండలంలోని కాపవరం పంచాయతీ మంచినీటి చెరువు మరమ్మతులు చేపట్టారు. దీనికోసం ప్రభుత్వం రూ.2.80లక్షలు నిధులు మంజూరు చేసింది. ఈ నిధులతో ఉపాధి కూలీలు గత వారం రోజుల నుంచి ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు పనులు నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా మంగళవారం 48 మంది ఉపాధి కూలీలు పనులు చేశారు. టెక్నికల్ అసిస్టెంట్ జె.జయబాబు పనులను పర్యవేక్షించారు. ఫీల్డ్ అసిస్టెంట్ అంగర దుర్గావెంకటరమణ ఉపాధి కూలీలతో పనులు చేయించారు.

ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా సంక్షేమం

మాజీ మంత్రి రంగనాథరాజు



ఆచంటలో గడపగడపకూ మన ప్రభుత్వంలో సంక్షేమాన్ని వివరిస్తున్న మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు

పెనుగొండ: రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అనుసరిస్తున్న విధానాలు, అమలు చేస్తున్న సంక్షేమాన్ని ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులు అనుసరిస్తున్నారని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. మంగళవారం ఆచంటలో గడపగడపకూ మన ప్రభుత్వంలో పాల్గొని లబ్ధిదారులకు అందించిన సంక్షేమాన్ని వివరించారు. సీఎం జగన్ అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన సచివాలయ వ్యవస్థ, రైతు భరోసా కేంద్రాలు, వలంటీర్ వ్యవస్థలను ఇతర రాష్ట్రాల్లోనూ ప్రారంభించడానికి ఆయా రాష్ట్రాల ముఖ్యమంత్రులు సన్నాహాలు చేస్తున్నారన్నారు. సీఎం జగన్ పాలనను వారు ఆదర్శంగా తీసుకొంటున్నారన్నారు. దేశంలో ఎక్కడాలేని విధంగా ప్రతీ గడపకూ మంచిచేసిన సీఎం జగన్ ఒక్కరు మాత్రమేనన్నారు. అర్హతే ప్రామాణికగా పార్టీలకతీతంగా సంక్షేమాన్ని అందించి ప్రజల మనస్సుల్లో నిలిచిపోయారన్నారు. అందుకే ధైర్యంగా ప్రతీ గడపకూ వెళ్లి వారికి అందించిన సంక్షేమాన్ని వివరిస్తున్నామన్నారు. దీంతో సీఎం జగన్‌పై ఒంటరిగా పోటీ చేసే ధైర్యం లేక చంద్రబాబు, దత్త పుత్రులు పొత్తుల కోసం తాపత్రాయ పడుతున్నారన్నారు. దీనికి భిన్నంగా 175 నియోజకవర్గాల్లోనూ ఒంటరిగా పోటీ చేసి గెలుస్తామన్న ధీమాతో సీఎం జగన్ ఉన్నారన్నారు. ప్రజల మీద నమ్మకంతోనే జగన్ ఉన్నారని, ప్రజలందరూ అండగా నిలిచి మరోసారి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో ఏఎంసీ వైస్ ఛైర్మన్ గుబ్బల వీర బ్రహ్మం, సర్పంచ్ కోట సరోజినీ వెంకటేశ్వరరావు, ఉప సర్పంచ్ అద్దాల పెద్దిరాజు, గ్రామ అధ్యక్షుడు పెచ్చెట్టి సత్యనారాయణ, కడలి నారాయణ ప్రసాద్, నల్లూరి చందు, నెక్కంటి రామలింగేశ్వరరావు, కుక్కల కిరణ్, వేమన అప్పారావు, అద్దాల ప్రసాద్, నెక్కంటి లక్ష్మీ దుర్గ, కప్పల భారతి, గురుజుకోట రాజ్యలక్ష్మీ, చింతపల్లి గురుప్రసాద్, దండు సత్యనారాయణ రాజు, మొల్లేటి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో సైన్స్ దినోత్సవ సందడి



మేడపాడు హైస్కూల్లో సైన్స్ దినోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం



పాలకొల్లులో పుస్తకాలను ప్రదర్శిస్తున్న ఉపాధ్యాయులు, అతిథులు

యలమంచిలి: ప్రతి విద్యార్థి శాస్త్రీయ దృక్పథం అలవరచుకోవాలని అప్పుడే నూతన ఆవిష్కరణలకు అవకాశం ఏర్పడుతుందని మేడపాడు హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు డి.ప్రసాద్ అన్నారు. జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా హైస్కూల్‌లో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సైన్స్ దినోత్సవ విశిష్టతను వివరించారు. ప్రతి విద్యార్థి సైన్స్‌లో ప్రేరణ పొందడానికే గత రెండు రోజులుగా పాఠశాలలో అన్ని తరగతుల విద్యార్థులకు సైన్ డ్రాయింగ్, వ్యాసరచన, క్విజ్, సైన్స్ బిట్ టెస్ట్, సైన్స్ ముగ్గులు పోటీలు నిర్వహించినట్లు ఆయన చెప్పారు. ఈ సందర్భంగా విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సానబోయిన వెంకట శ్రీనివాస్, కుంచే అరుణ జ్యోతి, పంతం రామ్మూర్తినాయుడు, రేలంగి రామకృష్ణ, అద్దాల శివరామకృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

గుమ్మలూరులో..

పోడూరు: విద్యార్థులు ప్రాథమిక పాఠశాల స్థాయిలోనే శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలని గుమ్మలూరు మెయిన్ పాఠశాల హెచ్‌ఎం కొల్లాబత్తుల సూర్యకుమార్ పిలుపునిచ్చారు. గుమ్మలూరు మెయిన్ పాఠశాలలో మంగళవారం సైన్స్ దినోత్సవాన్ని నిర్వహించారు. ముందుగా సీవీ రామన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులకు పలు రసాయనిక చర్యల ఫలితాలను ప్రయోగాత్మకంగా వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు శాంతాగ్రేస్ తదితరులు పాల్గొన్నారు.

పాలకొల్లులో..

పాలకొల్లు సెంట్రల్: స్థానిక దాసరి నారాయణరావు ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో మంగళవారం సైన్స్ డే కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా తాడేపల్లిగూడెం డీఆర్‌జీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఫిజిక్స్ లెక్చరర్ వెంకట గణేష్‌కుమార్ మాట్లాడుతూ సిటీస్కాన్, ఎంఆర్‌ఐ స్కాన్, ఆల్ట్రా సౌండ్, కొత్తగా వినియోగిస్తున్న వివిధ రకాల జీవవైద్య పరికరాల వినియోగంపై అవగాహన కల్పించారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ రవిశంకర్, డాక్టర్ పి వెంకటరమణ, విజయలక్ష్మి, శిరీష, సంధ్య, ఏ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. వైజ్ఞానిక ఆవిష్కరణల్లో భారతీయులకు నోబెల్ రావడం చాలా కష్టమని అటువంటి నోబెల్ ఘనతను సివి రామన్ సాధించి చరిత్ర పుటల్లో నిలిచారని ఏఎస్‌ఎన్‌ఎం కళాశాల ప్రిన్సిపాల్ టి రాజరాజేశ్వరి తెలిపారు. మంగళవారం స్థానిక అద్దేపల్లి సత్యనారాయణమూర్తి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ సైన్స్ డే కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ రామకృష్ణ, రమామణి, జగపతిబాబు, పూజిత పాల్గొన్నారు.

గ్రంథాలయానికి పుస్తకాల అందజేత

పాలకొల్లు సెంట్రల్: ప్రతి ఒక్కరికీ పుస్తకమే పరిజ్ఞానాన్ని పెంపొందిస్తుందని పట్టణ పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ కెఎస్‌పీఎన్ వర్మ తెలిపారు. మంగళవారం స్థానిక బీవీఆర్‌ఎం బాలికోన్నత పాఠశాలలో ప్రవాస భారతీయులైన ఎస్‌ఆర్‌ఐవీఏ సంస్థ సభ్యులు పాఠశాల గ్రంథాలయానికి రూ. 30 వేలు విలువ చేసే శాస్త్ర, సాంకేతిక, సాహిత్య, చరిత్ర, కథల వంటి విజ్ఞాన పుస్తకాలను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వై ప్రభాకరశాస్త్రి, డి.సుబ్బలక్ష్మి, జీవీ బ్రహ్మానందం రావు, సీహెచ్ శిరీష, ఏవీ రత్నం తదితరులు పాల్గొన్నారు.

రంగనాథరాజుకు కృతజ్ఞతలు



మాజీ మంత్రి శ్రీరంగనాథరాజుతో పర్వతారోహకుడు దాసు

పెనుగొండ: పర్వతారోహణకు ఆర్థికంగా వెన్నుదన్నుగా నిలిచిన మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజుకు పర్వతారోహకుడు గోగులమండల దాసు కృతజ్ఞతలు తెలిపారు. మంగళవారం తూర్పుపాలెంలోని కార్యాలయంలో కలిసి జీవితాశయం నెరవేర్చడానికి అండగా నిలుస్తున్నారన్నారు. ఈ నెల 22వ తేదీ వరకూ మౌంట్ ఎవరెస్ట్ ఎక్కడానికి శిక్షణ తీసుకున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకూ అధిరోహించిన మూడు పర్వతాలకే కాకుండా, మౌంట్ ఎవరెస్ట్ అధిరోహించడానికి సైతం మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు ఆర్థికంగా అండగా నిలుస్తున్నారన్నారు. ఇప్పటి వరకూ మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు ఆర్థికంగా నిలిచారన్నారు. ఏప్రిల్ నెలలో మౌంట్ ఎవరెస్ట్ అధిరోహించడానికి సన్నాహం చేసుకొంటున్నట్లు తెలిపారు. దీనికి సైతం అయ్యే ఖర్చును మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు అందించడానికి భరోసా ఇచ్చారు. ఎవరెస్ట్ అధిరోహించడానికి 60 రోజుల సమయంపడుతుందన్నారు. సహకరిస్తున్న మాజీ మంత్రి శ్రీరంగనాథరాజుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పోడూరు జెడ్పీటీసీ సభ్యుడు గుంటూరి పెద్దిరాజు, ఏపీ సీడ్స్ కార్పొరేషన్ డైరక్టరు పోతుమూడి రామచంద్రరావు పాల్గొన్నారు.

బెల్లం విక్రయాల్లో జాగ్రత్తలు తీసుకోవాలి

సాక్షి, భీమవరం: బెల్లం విక్రయాల్లో జాగ్రతలు పాటించాలని నాటుసారా తయారు చేసే వ్యక్తులకు బెల్లం విక్రయించవద్దని భీమవరం సెబ్ ఇన్‌స్పెక్టర్ వీవీవీఎస్ఎస్ వర్మ స్పష్టం చేశారు. మంగళవారం సెబ్‌స్టేషన్ ఆవరణలో బెల్లం వర్తకులు, కిరాణా మర్చంట్స్ అసోసియేషన్‌తో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎవరికైనా సొంత అవసరాలకు పెద్ద మొత్తంలో బెల్లం విక్రయించాల్సివస్తే వారి నుంచి సరైన ధ్రువపత్రాల కాపీలు తీసుకోవాలని వర్మ సూచించారు. ఏవీ కృష్ణారావు, ఎ.శివప్రసాదరావు, ఎస్.చిన వెంకటేశ్వరరావు, వై.ప్రసాదరావు, కె.యోగయ్య, ఎ రామకృష్ణ పాల్గొన్నారు.

రామన్నపాలెం-2లో ఫ్యామిలీ డాక్టర్

మొగల్తూరు: మండలంలోని రామన్నపాలెం–2 సచివాలయ పరిధిలో మంగళవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. డాక్టర్ దినేష్ ఆరోగ్య కేంద్రానికి వచ్చిన రోగులతో పాటు ఇంటింటికి వెళ్లి సుమారు 145 మంది రోగులను పరిక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది జ్ఞానరత్నం, సావిత్రి, స్వర్ణలత, కె.శ్రీనివాసరావు, ప్రభాకర్, సతీష్ పాల్గొన్నారు.

జాబ్‌మేళాలో 968 మందికి ఉద్యోగాలు



జాబ్‌మేళాలో ఉద్యోగాలు పొందిన వారికి నియామక పత్రాలు అందజేస్తున్న దృశ్యం

పాలకొల్లు అర్బన్: మండలంలోని పూలపల్లి శ్రీ గౌతమి డిగ్రీ కళాశాలలో మంగళవారం నిర్వహించిన మెగా జాబ్ మేళాలో 968 మంది ఉద్యోగాలు పొందారు. మెగా జాబ్‌మేళాలో పట్టణ ఎస్సై ఏఎస్సై ఎస్ఎన్ ముత్యాలరావు, ఏఎస్సై శివాజీ పాల్గొని ఇంటర్వ్యూలకు హాజరైన నిరుద్యోగులకు పలు సూచనలు, సలహాలిచ్చారు. 20 బహుళ జాతి కంపెనీల ప్రతినిధులు హాజరయ్యారు. 4617 మంది యువత ఇంటర్వ్యూలకు హాజరుకాగా వీరిలో 968 మంది ఉద్యోగాలు పొందారు. ప్రిన్సిపాల్ ఏనుగుపల్లి శివకుమార్, వికాస మేనేజర్ ఎస్ పవన్ కుమార్, శ్రీ గౌతమి డిగ్రీ కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ చినిమిల్లి దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యంపై మండిపాటు



కౌన్సిల్ సమావేశంలో పాల్గొన్న కౌన్సిలర్లు



చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ

నరసాపురం: మున్సిపల్ పాలనా వ్యవహారాల్లో అధికారుల తీరు అధ్వానంగా ఉందని నరసాపురం మున్సిపల్ కౌన్సిల్ కో–ఆప్షన్ సభ్యుడు ఏడిద కోటసత్యనారాయణ ధ్వజమెత్తారు. అధికారుల తీరులో కౌన్సిల్‌కు చెడ్డ పేరు వస్తుందని ఆరోపించారు. నరసాపురం మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం మంగళవారం చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ అధ్యక్షతన వాడీవేడిగా సాగింది. ముందుగా వైకేఎస్ మాట్లాడుతూ మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌ల్లోని షాపుల రెన్యువల్ విషయంలో రెవెన్యూ అధికారులు అనుసరిస్తున్న విధానాలపై మండిపడ్డారు. కౌన్సిల్‌కు తెలియకుండా ఇష్టానుసారం వ్యవహరించడం తగదని హెచ్చరించారు. అలాగే కౌన్సిలర్లు ఏదైనా సమాచారం అడుగుతుంటే సవ్యంగా సమాధానం చెప్పడం లేదన్నారు. ఇదే అంశంపై 1వ వార్డు సభ్యురాలు సోమరాజు దుర్గాభవానీ తీవ్రంగా స్పందించారు. తాను గత సమావేశంలో తమ వార్డులో ప్రైవేట్ వాహనాలు రోడ్డుపై ఇష్టానుసారం నిలుపుతున్నారని దానిపై ఏం చర్యలు తీసుకున్నారని అడిగానని, దానికి సమాధానంగా డ్రెయిన్ పనులు జరుగుతున్నాయని సమాధానం పంపించారని ఎద్దేవా చేశారు. అసలు సభ్యులు ఏం ప్రశ్నలు అడుగుతున్నారో అర్థం కాని స్థితిలో ఉన్నారా? అని కమిషనర్‌ను ప్రశ్నించారు. సఖినేటిపల్లి సురేష్ అపార్ట్‌మెంట్స్ వద్ద రోడ్డు మీదకు ట్రాన్స్‌ఫార్మర్లు నిర్మిస్తున్నారని, ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడుతున్నాయని ప్రశ్నించారు.

కుక్కల బెడద నివారించాలి

అధికార వైఎస్సార్‌సీపీ సభ్యురాలు కావలి రామసీత వీధి కుక్కల బెడదపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వార్డుకొచ్చి 200,300 వీధికుక్కలు తిరుగుతున్నాయని, ప్రజలు భయభ్రాంతులకు గురౌతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కమిషనర్ సీహెచ్ శ్రీనివాస్ మాట్లాడుతూ కుక్కల నివారణపై చట్ట ప్రకారం చర్యలు చేపడతామన్నారు. మంచినీరు, పారిశుద్ధ్యం అంశాలపై సభ్యులు పతివాడ పద్మ, సిర్రా కాంతమ్మ ప్రశ్నించారు. వాటర్‌వర్క్స్ కార్యాలయం సామాగ్రిని దొంగిలించి అమ్ముకున్న మున్సిపల్ సిబ్బందిపై ఏం చర్యలు తీసుకున్నారని జనసేన సభ్యులు కొప్పాడ కృష్ణవేణి తదితరులు ప్రశ్నించారు. ఈ అంశంపై సమావేశంలో కొద్దిసేపు గొడవ జరిగింది. ఘటనకు కారణమైన కాంట్రాక్టు సిబ్బందిని విధుల నుంచి తొలగించామని, పోలీసులకు ఫిర్యాదు చేయడం, సామగ్రి స్వాధీనం చేసుకున్నామని చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ వివరించారు. వైస్ చైర్మన్‌లు కామన నాగిని, కొత్తపల్లి నాని, కౌన్సిలర్లు వన్నెంరెడ్డి శ్రీనివాస్, పాలంకి బాబ్జి, జిల్లెళ్ల దిలీప్, బొంతు రాజశేఖర్, కోటిపల్లి సురేష్, గొల్ల జయరాజ్‌సింగ్, వంగా శ్రీకాంత్‌కన్నా ద్వారా దుర్గాభవానీ పలు సమస్యలపై ప్రశ్నించారు.

లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే క్రిమినల్ కేసులు



సమావేశం నిర్వహిస్తున్న సబ్‌కలెక్టర్ ఎం.సూర్యతేజ

నరసాపురం: లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని స్కానింగ్ సెంటర్‌ల నిర్వాహకులను నరసాపురం సబ్‌కలెక్టర్ ఎం.సూర్యతేజ హెచ్చరించారు. మంగళవారం సబ్‌కలెక్టర్ తన కార్యాలయంలో లింగనిర్ధారణచట్టం డివిజన్ కమిటి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించిన, ప్రోత్సహించినా నేరమేనన్నారు. ఏదైనా స్కానింగ్ సెంటర్‌లపై గర్భస్థ లింగ నిర్ధారణ పరీక్షలు జరుగుతున్నట్లుగా ఫిర్యాదులు వస్తే వెంటనే దర్యాప్తు చేపట్టిన నిర్వహకులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలన్నారు. స్కానింగ్ సెంటర్‌లను కమిటి ఆకస్మికంగా తనిఖీ చేయాలని చెప్పారు. ప్రస్తుతం ఉన్న రిజిస్ట్రేషన్‌లు, రెన్యువల్స్‌ను పరిశీలించాలని పేర్కొన్నారు. వైద్య ఆరోగ్యశాఖ లింగ నిర్ధారణ చట్టంపై అవగాహనా కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో కమిటీ కన్వీనర్, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ వి.ప్రసాద్, సీఐ సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

షెడ్డు నిర్మాణాన్ని అడ్డుకున్న అధికారులు

యలమంచిలి: కొంతేరు పంచాయతీ ఆకులవానిగరువులో పంట బోది గట్టున (ఆర్‌అండ్‌బీ రోడ్డు మార్జిన్‌లో) నిర్మిస్తున్న షెడ్డు నిర్మాణాన్ని అడ్డుకోవాలని గ్రామానికి చెందిన బొలిశెట్టి వెంకట నరసింహ నారాయణరావు పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ షెడ్డు నిర్మాణం వలన జక్కంశెట్టి వారి పుంత, కట్టా వారి పుంతలో ఉన్న వరిచేలకు వెళ్లే సాగునీటి బోదిలో నీటి పారుదలకు అడ్డంకి కలగడమే కాకుండా జగనన్న కాలనీకి వెళ్లే విద్యుత్ లైన్‌కు అడ్డంకి కలుగుతుందని ఫిర్యాదులో పేర్కొన్నారు. అంతే కాకుండా రోడ్డు మార్జిన్ కావడం వల్ల ట్రాఫిక్‌కు అంతరాయం కలిగి ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. దీంతో పంచాయతీ కార్యదర్శి కూనా వెంకట రామాంజనేయులు, వీఆర్వో గెద్దం సత్యనారాయణలు మంగళవారం షెడ్డు వద్దకు వెళ్లి నిర్మాణ పనులను అడ్డుకున్నారు. పంచాయతీ అనుమతి లేకుండా ఈ ప్రదేశంలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టవద్దని హెచ్చరించారు.


పింఛన్ల పంపిణీలో గృహ సారథులు పాల్గొనాలి



సమావేశంలో మాట్లాడుతున్న శాంతకుమారి

యలమంచిలి: పింఛన్ల పంపిణీలో గృహ సారథులు పాల్గొనాలని మేడపాడు సర్పంచ్ గంటా శాంత కుమారి అన్నారు. మేడపాడులో మంగళవారం వలంటీర్లతో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రభుత్వ పథకాలను ప్రజలకు అందించడంలో ఇంతవరకు వలంటీర్లు పోషించిన పాత్ర అమోఘమన్నారు. కార్యక్రమంలో స్థానిక సొసైటీ త్రిసభ్య కమిటీ చైర్మన్ గుర్రాల వెంకట్రావు, ఎంపీటీసీ సభ్యురాలు డేగల సూర్యప్రభ, సచివాలయ కన్వీనర్ కుసుమే సోని నాయకులు డేగల వెంకటేశ్వరరావు, కుసుమే శేకర్ తదితరులు పాల్గొన్నారు.

డ్రెయిన్‌లో సిల్టు తొలగింపు



డ్రెయిన్‌లో సిల్టు తొలగిస్తున్న దృశ్యం

పోడూరు: జగన్నాథపురం శివారు మంగళిగుంటలో మంగళవారం గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో జేసీబీతో డ్రెయినేలోని సిల్టు తొలగించారు. సర్పంచ్ గుడాల శిరీషచంటి, పంచాయతీ కార్యదర్శి సుధారాణి, వార్డుమెంబర్లు పనులను పర్యవేక్షించారు. డ్రెయిన్‌లో సిల్టు పేరుకుపోవడంతో మురుగు బయటకు వెళ్లక స్థానిక ప్రజలు ఇబ్బందులు పడుతుండడంతో పంచాయతీ ఆధ్వర్యంలో సిల్టు తొలగింపు పనులు చేపట్టినట్లు సర్పంచ్ శిరీష చంటి తెలిపారు. ఏఎంసీ డైరెక్టర్ వరప్రసాద్, వార్డు మెంబరు తొత్తరమూడి దుర్గ, వీఆర్‌ఓ స్వామి పనులను పరిశీలించారు.

ఉత్సాహంగా టైలర్స్ డే



సిద్ధాంతంలో సీనియర్ దర్జీలను సత్కరిస్తున్న టైలర్లు



మొగల్తూరులో ర్యాలీ నిర్వహిస్తున్న టైలర్లు

పెనుగొండ: మండలంలోని పెనుగొండ, సిద్ధాంతం గ్రామాల్లో మంగళవారం టైలర్స్‌డే వేడుకగా నిర్వహించారు. సిద్ధాంతంలో సరస్వతీ టైలర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి, సీనియర్ టైలర్లు బొంతు పాటియ్య, చింతాకుల సత్యనారాయణలను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు దొంగ నాగరాజు, ఉపాధ్యక్షుడు అద్దాల మధు, మట్టపర్తి శ్రీను, రామిశెట్టి రాంబాబు, సానబోయిన శ్రీను(సునీల్), మహిళా సభ్యులు పాల్గొన్నారు. పెనుగొండలో లక్ష్మీ గణపతి టైలర్స్ వెల్ఫేర్ అసోషియేషన్ ఆధ్వర్యంలో టైలర్స్ డే ఘనంగా నిర్వహించారు. పెనుగొండలో టైలర్లు ర్యాలీ నిర్వహించారు. సంఘ నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

కొడమంచిలిలో

ఆచంట మండలం కొడమంచిలిలో టైలర్స్ డే వేడుకగా నిర్వహించారు. అనంతరం పతాకావిష్కరణ చేశారు. కార్యక్రమంలో ఆచంట మండల సర్పంచ్‌ల ఛాంబర్ అధ్యక్షుడు సుంకర సీతారామ్, సంఘ నాయకులు పాల్గొన్నారు.

మొగల్తూరులో..

మొగల్తూరు: మార్కెట్లోకి బ్రాండెడ్ దుస్తులు రావడంతో టైలర్ల జీవనోపాధి దెబ్బతిందని పలువురు టైలర్లు వాపోయారు. ఫిబ్రవరి 28 ప్రపంచ టైలర్ దినోత్సవం సందర్భంగా మంగళవారం మొగల్తూరు బాపూజీ టైలర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా టైలర్ల సంఘం నాయకులు మాట్లాడుతూ నేటి ఆధునిక యుగంలో దుస్తులు కుట్టడం దర్జీలకు సవాలుగా మారందన్నారు. వినియోగదారుడుకు నచ్చేలా దుస్తులు కుట్టే టైలర్లను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బొల్లా శ్రీరామ చంద్రమూర్తి, నంబాల రమేష్,పడవల నారాయణ,షరాబ్ సూర్యనారాయణ, బొక్కా రాజేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.